## ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ తప్పుకాదు

- చెల్లింపుల విధానం సరికాదు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- అది లొట్టపీసు కేసని అప్పుడే చెప్పాం: బీఆర్ఎస్



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో కాంగ్రెస్ సర్కార్ కొండను తవ్వి ఎలుకను పట్టిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. శనివారం అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఫార్ములా-ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడాన్ని తాము ఎప్పుడూ తప్పు పట్టలేదని, అయితే చెల్లింపుల విషయంలో ప్రొసీజర్ ఫాలో కాలేదని మాత్రమే చెప్పామని ఆయన పేర్కొన్నారు. ఈ-రేస్ వ్యవహారంలో కేటీఆర్‌తో పాటు పలువురిపై కేసులు, ఏసీబీ విచారణ అంటూ ఊదర గొట్టి ప్రభుత్వం ఇప్పుడు యూ టర్న్ తీసుకున్నదని మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను బట్టి తేలిపోయిందని సోషల్ మీడియాలో నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఫార్ములా ఈ-రేస్‌పై నమోదైన కేసును బీఆర్ఎస్ మొదటి నుంచి లొట్టపీసు కేసుగా అభివర్ణిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ప్రపంచ ప్రఖ్యాత ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ కోసం నిధుల విడుదలకు అప్పటి మంత్రి హోదాలో కేటీఆర్ అనుమతినిస్తే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నానాయాగీ చేశారని బీఆర్ఎస్ పునరుద్ఘాటించింది. రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి రాగానే ఫార్ములా ఈ-రేస్‌ను ఏకపక్షంగా రద్దు చేశారు. పర్యావరణానికి మేలు చేసే ఎలక్ట్రిక్ వాహనాల ప్రమోషన్ కోసం అప్పటి ప్రభుత్వం ఎంతో శ్రమ పడి ఫార్ములా ఈ -రేస్ హైదరాబాద్‌కు తెచ్చిన విషయాన్ని బీఆర్ఎస్ గుర్తుచేస్తున్నది. 2023లో హైదరాబాదులో నిర్వహించిన తొలివిడత ఫార్ములా ఈ-రేస్‌తో రాష్ట్రానికి దాదాపు రూ .700 కోట్ల పరోక్ష లబ్ధి చేకూరిందని పేర్కొన్నది.

## విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

నమస్తే ఎఫెక్ట్

వెల్గటూర్, మార్చి 15 : జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో 'రైతులను వెంటాడుతున్న కరెంటు కష్టాలు' అనే శీర్షికతో ఈ నెల 14న శుక్రవారం 'నమస్తే తెలంగాణ' మెయిన్ ఎడిషన్‌లో కథ నం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. రైతుల సహకారంతో రైతు మిత్ర వాహనంలో జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీసుకు వచ్చి బింగించామని తెలిపారు. యాసంగి దృష్ట్యా పొలాలు ఎండకుండా తమ సిబ్బంది అన్ని సమయాల్లో రైతులకు అందుబాటులో ఉంటున్నారని రాజారాంపల్లి ఏఈఈ సమ్మయ్య తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడకుండా రైతులు తమ మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, మోటర్లను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కులగణన నివేదికను బయటపెట్టండి

### రేవంత్‌కు బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం లేఖ

హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన నివేదికను వెంటనే బయటపెట్టాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖను రాశారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని న్యాయపరంగా బలోపేతం చేయకపోతే.. భవిష్యత్తులో చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు. 42% రిజర్వేషన్ల అమలుకు బలమైన ఆధారాలు అవసరమని.. శాస్త్రీయంగా నిరూపించాల్సి ఉంటుందని.. అవేవీలేకుండా బిల్లులను ప్రవేశపెడితే భవిష్యత్తులో వివాదాలు తలెత్తుతాయని సూచించారు. కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ నివేదికను వెల్లడించిన అనంతరమే బీసీ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టాలని కోరారు. అలాగే డెడికేటెడ్ కమిషన్ నివేదికలోని లోపాలను సవరించాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టి బీసీలపై చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్‌చేశారు.

### ● పెండింగ్ స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల భిక్షాటన




పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జనగామ జిల్లా కేంద్రంలో వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్(వీఎస్ఎఫ్)ఆధ్వర్యంలో విద్యార్థులు భిక్షాటన చేశారు. వీఎస్ఎఫ్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. - జనగామ చౌరస్తా

### ● జీతాలు రాక.. ఫీల్డ్ అసిస్టెంట్ల భిక్షాటన



ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో జగిత్యాల జిల్లా రాయికల్‌లో శనివారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కొందరు ఉద్యోగులకు జీతాలిచ్చి తమకు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన పేస్కేల్‌ను అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. - రాయికల్

# కాంగ్రెస్ నేత సంస్థకు బెంచీల కాంట్రాక్టు

- కాంగ్రెస్ కార్యకర్త వైపు సర్కారు మొగ్గు
- అంగన్‌వాడీ బెంచీల కాంట్రాక్ట్‌లో మతలబు
- నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టే యత్నం
- షాడో మంత్రి మల్లన్న కనుసన్నల్లోనే వ్యవహారం



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): 'వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఏ మూలకు కూర్చున్నా తినొచ్చు' అన్న సామెత కాంగ్రెస్ పాలనకు సరిగ్గా అతుకుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు ఇలాగే మేలు చేసేలా రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో గురుకులాలకు, ఎన్నో ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు తక్కువ ధరకే నాణ్యమైన ఫర్నిచర్‌ను సమకూర్చిన ప్రభుత్వ సంస్థను కాదని, నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త 'దత్తుడి'కి బెంచీల కాంట్రాక్టును ధారదత్తం చేసేందుకు యత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. అదీ బ్లాక్ లిస్టులో ఉన్న కేంద్రీయ భండార్ ముసుగులో ఆ కాంట్రాక్టును అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్టు వినికిడి. అంగన్‌వాడీ కేంద్రాలకు బెంచీలను సమకూర్చే ఆ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. గతంలో సరుకుల సరాఫరాకు ఒప్పందం కుదుర్చుకొనేందుకు ఆ నేత విఫలయత్నం చేసినట్టు తెలిసింది. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన సంస్థకు దొడ్డిదారిలో లబ్ధి చేకూర్చేందుకు సర్కారు యోచిస్తున్నది. ఇందుకు నల్లగొండ జిల్లాకు చెందిన షాడో మంత్రి మల్లన్న ద్వారా రాయ'బేరం' కుదిరినట్టు సమాచారం అందుతున్నది. సుమారు రూ.40 కోట్ల విలువైన 75,000 బెంచీలను సమకూర్చే ఆర్డర్లను టెండర్లు పిలువకుండానే నామినేషన్‌పై ఇచ్చేందుకు ఒప్పందం జరిగినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది. పౌష్టికాహారం, ఇతర సేవల కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులు, బాలింతలకు బెంచీలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖను ఆదేశించింది. దీంతో సుమారు 35 వేల కేంద్రాలకు 2024-25 సంవత్సరానికి 75,000 బెంచీలు, టేబుళ్లు అవసరమని గుర్తించారు. దీంతో ప్రభుత్వం వాటిని సమకూర్చేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఇదే అదనుగా నల్లగొండ జిల్లాకు చెందిన సదరు కాంగ్రెస్ కార్యకర్త రంగంలోకి దిగారు. ఓ ప్రభుత్వ సంస్థ ముసుగులో షాడో మంత్రి అండదండలతో కాంట్రాక్టును దక్కించుకొనేందుకు పావులు కదుపుతున్నారు. కాంట్రాక్ట్ ఇస్తే 'చేయూత' అందిస్తానని అదే జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేత ద్వారా రాయబేరం నడిపినట్టు తెలుస్తున్నది.

### ఖైదీల కష్టానికి ఎసరు.. ఆదాయానికి గండి

చంచల్‌గూడ సెంట్రల్ జైలు సంస్థ రాష్ట్రంలోని గురుకులాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నిచర్ అందజేస్తున్నది. ఫర్నిచర్ తయారీకి ఈ సంస్థకు మానవ వనరులతోపాటు కార్ఖానాలు ఉన్నాయి. కొన్నేండ్లుగా ఖైదీలతో ఉత్పత్తులను తయారు చేయించి ఆర్డర్లు ఇచ్చిన సంస్థలకు సరఫరా చేస్తుంది. ఫర్నిచర్ తయారీలో కచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తుందని జైళ్లశాఖకు మంచి పేరున్నది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖైదీల సంక్షేమం, జైళ్ల నిర్వహణకు ఉపయోగిస్తుంది. కానీ ఇప్పుడు ఆ ఆదాయానికి గండికొట్టే కుట్రలకు ప్రభుత్వమే తెరలేపిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చంచల్‌గూడ జైలు ఫర్నిచర్ నాణ్యతగా లేదనే సాకుతో ప్రభుత్వ సంస్థ ముసుగులో ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఖైదీల కష్టానికి ఎసరుపెట్టి, సదరు సంస్థ ఆదాయానికి గండికొట్టేందుకు ప్రభుత్వమే పూనుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

### చకచకా పావులు.. మూడురోజుల్లోనే ఆర్డర్లు

అంగన్‌వాడీలకు బెంచీలను సమకూర్చేందుకు ఆసక్తి, అర్హత ఉన్న సంస్థలు ముందుకు రావాలని ప్రభుత్వం ఫిబ్రవరి 18న నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో ఫిబ్రవరి 20న కాంగ్రెస్ కార్యకర్త ప్రోద్బలంతో కేంద్రీయ భండార్‌తోపాటు మరో ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ జైలు, చంచల్‌గూడ, హైదరాబాద్ పేరిట ప్రతిపాదనలు అందాయి. ఇందులో 60 ఇంచుల పొడువు, 15 ఇంచుల వెడల్పుతో కూడిన ఒక్కో బెంచీ యూనిట్‌ను కేంద్రీయ భండార్ రూ.4,907 (మొత్తం జీఎస్టీ, రవాణా ఖర్చులు)కు అందిస్తామని ప్రతిపాదనలు అందించింది. ఇదే టేబుల్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలు సంస్థ రూ.4,778కి అందిస్తామని, ఒక్కో యూనిట్‌కు రూ.129కి తక్కువకు సమకూరుస్తామని ప్రతిపాదనలు అందజేసింది. మొత్తంగా రూ.96.75 లక్షల మేర తక్కువకు సమకూర్చేందుకు ముందుకొచ్చింది. అయితే తక్కువకు ఇచ్చే సంస్థను పక్కనబెట్టి, ఆగమేఘాలపై మూడురోజుల్లోనే మానవవనరులే లేని, తయారీకి కార్ఖానాలూ లేని కాంగ్రెస్ కార్యకర్త సంస్థకు కాంట్రాక్టును అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం అనుమానాలు రేకెత్తిస్తున్నది. సదరు నేత 'సత్తు' మాయజాలంతోనే అర్హతలేని సంస్థకు ఆర్డర్లు ఫైనల్ చేసేందుకు సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

### బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు అప్పగింత!

కేంద్రీయ భండార్‌పై గతంలో అనేక అవినీతి ఆరోపణలు రావడంతో కోర్టు ఆదేశాల మేరకు 2023 ఏప్రిల్ 10 నుంచి 2025 ఏప్రిల్ 09 వరకు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. ఇంకా గడువు కూడా ముగియకముందే సదరు సంస్థకు బెంచీలను సమకూర్చే బాధ్యతలు అప్పగించేందుకు యత్నించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదీకూడా తక్కువకు కోట్ చేసిన ప్రభుత్వ సంస్థను కాదని, కాంగ్రెస్ కార్యకర్తకు చెందిన సంస్థకు ఇవ్వడం వెనుక కమీషన్ల తతంగం సాగినట్టు తెలుస్తున్నది. దీనికి తనవంతు సహకారం అందించేందుకు దత్తుడు అంగీకరించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి ఆ షాడో మంత్రి మధ్యవర్తిగా వ్యవహరించి చక్రం తిప్పినట్టు వినికిడి. ఆయన సమక్షంలోనే ఈ ఒప్పందం జరిగినట్టు తెలుస్తున్నది.

### ప్రతిపాదనలు వాస్తవమే..



అంగన్‌వాడీ కేంద్రాలకు బెంచీలను సమకూర్చేందుకు గత ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీచేశాం. ప్రభుత్వ సంస్థలైన కేంద్రీయ భండార్, జైళ్ల శాఖ నుంచి ప్రతిపాదనలు అందాయి. వీటిని పరిశీలిస్తున్నాం. గతంలో కేంద్రీయ భండార్‌కు ప్రభుత్వం పలురకాల ఆర్డర్లు ఇచ్చింది. ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదు. అర్హతలు ఉన్న సంస్థకే కాంట్రాక్ట్ ఇస్తాం.

**- అనితారామచంద్రన్, ప్రిన్సిపల్ సెక్రటరీ, మహిళా శిశు సంక్షేమశాఖ**

## డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ ఎక్కడ?

- వేదికను తేల్చడంపై సర్కారు సందిగ్ధత
- జానారెడ్డితో చర్చించిన భట్టి



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై అనుసరించాల్సిన వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశానికి ఏర్పాట్లు ముమ్మరం చేసింది. పార్టీల అభిప్రాయాలు తెలుసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీనియర్‌నేత జానారెడ్డి చర్చలు జరుపుతున్నారు. శనివారం జనారెడ్డితో భట్టివిక్రమార్క భేటీ అయ్యారు. ఇప్పటికే డీలిమిటేషన్‌పై సలహాలు ఇవ్వాలంటూ బహిరంగ లేఖ విడుదల చేశారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని శనివారం పలు పార్టీల నేతలతో భట్టి మాట్లాడినట్టు తెలుస్తున్నది.

## కష్టపడి ఎదిగితే.. ఇబ్బంది పెడుతున్నరు

- సోషల్‌మీడియా పోస్టులతో దెబ్బతింటున్న మనోబలం
- అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క చిట్‌చాట్



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): మహిళలు రాజకీయాల్లో ఎదగడమే కష్టం.. అలాంటిది ఈ స్థాయికి వస్తే తమను కొందరు ఇబ్బంది పెడుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తంచేశారు. సోషల్ మీడియా పోస్టులు కొన్నిసార్లు తన మనోబలాన్ని దెబ్బతీశాయని వాపోయారు. అసెంబ్లీ లాబీలో శనివారం ఆమె మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 'సోషల్ మీడియా ద్వారా నాకు చాలా ఇబ్బంది ఏర్పడింది. కొందరు నా ఫొటోలు మార్ఫింగ్ చేసి.. మానసిక వేదనకు గురిచేశారు. సోషల్ మీడియాను సోషల్‌సర్వీస్‌కు వాడుకున్న నేను.. అంతే ఇబ్బందులకు గురయ్యాను. సోషల్ మీడియా కుటుంబాలను బజారుకీడుస్తున్నది' అని సీతక్క పేర్కొన్నారు.

# ఉస్మానియా వర్సిటీపై ఉక్కుపాదం

▸ మొదటిపేజీ తరువాయి...

నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత ఉస్మానియాపై ఇలాంటి నిషేధాజ్ఞలు విధించడం విపరిణామమే. వర్సిటీ అధికారుల ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

### ప్రతికూల ప్రభావం సాకుగా చూపి

ఉస్మానియా యూనివర్సిటీ, దాని విభాగాలు, కళాశాలలు, కేంద్రాలు, పరిపాలనా భవనాల్లో ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిషేధిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ఈ సర్క్యులర్ జారీచేశారు. నిరసనలు యూనివర్సిటీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు పరిపాలన, విద్యా పురోగతిని జాప్యంచేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో భద్రతా సమస్యలు సైతం తలెత్తాయని తెలిపారు. వర్సిటీ భవనాల్లోకి అనధికారికంగా ప్రవేశించడం, ధర్నాలు, ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిరోధించడం, వర్సిటీ ఉద్యోగులు, అధికారులపై అభ్యంతరకరమైన భాషను వినియోగిస్తూ దూషించడాన్ని సంపూర్ణంగా నిషేధించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఏదైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించడం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

### నిరసన తెలుపడం ప్రజాస్వామిక హక్కు



శాంతియుతంగా నిరసన తెలపడం ప్రతిఒక్కరి ప్రజాస్వామిక హక్కు. ఔటా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పరిధులకు లోబడి, శాంతియుతంగా ఎవరైనా నిరసనలు తెలుపొచ్చు. ఆందోళనల ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సైతం సిద్ధించింది. దానిని అడ్డుకోవడం నియంతృత్వం కిందికే వస్తుంది. తక్షణమే ఈ సర్క్యులర్ను వెనక్కి తీసుకోవాలి. నిరసనలు తెలుపడం సంఘాల ప్రాథమిక హక్కు. దానిని అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు.

**- ప్రొఫెసర్ మనోహర్, అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా)**

### ఆది నుంచీ ఉద్యమాల కేంద్రంగా..

ఉస్మానియా యూనివర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి సమర్థమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ వచ్చింది. వందేమాతరం ఉద్యమంతోపాటు అనేక సామాజిక, రాజకీయ, ప్రజా ఉద్యమాలకు ఈ వర్సిటీ వేదికగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి సైతం గుండెకాయగా నిలిచింది. అధికారంలో ఏ ప్రభుత్వాలు ఉన్నా యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛను దెబ్బ తీయలేదు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వర్సిటీ గొంతు నొక్కే కుట్రలకు తెరలేపింది.

### భగ్గుమన్న విద్యార్థి నేతలు, విద్యావేత్తలు

అధికారంలోకి రాగానే ప్రజాపాలన తెస్తామంటూ గొప్పలు పలికిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే పార్టీ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకమైన వర్సిటీ విద్యార్థుల గొంతు నొక్కడం ఎంతవరకు సమంజసమని పలువురు విద్యావేత్తలు, విద్యార్థి నేతలు ప్రశ్నిస్తున్నారు. ముక్తకంఠంతో విద్యార్థి, ప్రజా సంఘాలు దీనిని ఖండించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల గొంతులు నొక్కే ఈ ప్రయత్నాన్ని విరమించుకొని, సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అప్రజాస్వామిక, నియంతృత్వ ఆదేశాలకు ఉస్మానియా యూనివర్సిటీ ఏనాడూ తలవంచబోదని స్పష్టం చేస్తున్నారు.

### నిర్బంధ పాలనకు నిదర్శనం



అధికారుల సర్క్యులర్ అప్రజాస్వామికం. నిర్బంధ పాలనకు నిదర్శనం. దీనిద్వారా విద్యార్థి సంఘాల ను బెదిరిస్తున్న తీరును తీవ్రంగా వ్య తిరేకిస్తున్నాం. విద్యార్థుల హక్కులను కాలరాయడమే కాకుండా, వారి గొం తు నొక్కే ప్రయత్నమే ఈ నిర్ణయం. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమిస్తాం.

**- చటారి దశరథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్వీ**

### సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి



ఓయూ వీసీ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గర్హనీయం. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఉత్తర్వులు జారీచేయడం సిగ్గుచేటు. తక్షణమే దానిని వెనక్కి తీసుకోవాలి. యూనివర్సిటీలో నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతి కల్పించేందుకు ప్రయత్నించాలి, కానీ విద్యార్థుల హక్కులను కాలరాయొద్దు.

**- అలివేలి రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏబీవీపీ**

### విద్యార్థుల సమస్యలు పట్టని వీసీ



ఓయూ వీసీ కుమార్‌కు విద్యార్థు ల సమస్యలు పట్టవు. సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారు. సమస్యలపై ప్రశ్నించిన వారిని సెక్యూరిటీ గూండాలతో దాడులు జరిపిస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి. లేకుంటే ఓయూ పరిపాలనా భవన్‌ను ముట్టడిస్తాం.

**- నెల్లి సత్య, కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్, ఓయూ కౌన్సిల్**

# రహస్య మంతనాలు నిజమేనా?

- మహేశ్వర్ రెడ్డి మంచి ఫ్రెండే..
- ఈ రోజు కాకపోతే రేపు మా దగ్గరే కూర్చుంటాడు..
- అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- ఇటీవల సీఎంతో బీజేపీ నేతల సీక్రెట్ మీటింగ్స్ అని రాజాసింగ్ కామెంట్స్
- అసెంబ్లీలో సీఎం మాటలతో అనుమానాలకు బలం
- తాజా పరిణామాలతో బీజేపీలో దుమారం



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితో బీజేపీ ముఖ్య నేతల రహస్య మంతనాలు నిజమేనా..? రెండు పార్టీల స్నేహ 'హస్తం' కండువాలు మార్చుకునేంతలా బలపడిందా..? కేంద్రంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూనే రాష్ట్రంలో 'ఆపరేషన్ ఆకర్ష్' పేరిట బీజేపీ నేతలకు సీఎం సీఎం వల విసురుతున్నారా? రాజాసింగ్ రెండు రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించినవేనా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ఇందుకు శనివారం అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. 'మా మిత్రుడు మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.. మంచి మనసుంటే ఈ రోజు కాకపోతే రేపైనా మాతోనే కూర్చుంటాడు..' అని సీఎం రేవంత్ అసెంబ్లీ సాక్షిగా వ్యాఖ్యనించారు. ఇక ఈ వ్యాఖ్యలను మహేశ్వర్ రెడ్డి కూడా ఖండించకపోవడంతో పార్టీ మార్పు అనివార్యమా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### పాత పరిచయాలతో మంత్రాంగం..

మరోవైపు ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గుర్తింపు, బీజేపీలో లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం చెప్పడం సైతం ఈ అనుమానాలను మరింత బలం చేకూరుస్తున్నది. ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పొసగకపోవడంతో పార్టీని వీడారు. బీజేపీలో చేరి నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కాషాయపార్టీలో బీజేఎల్పీ నేతగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన విరుచుకుపడుతున్నారు. పలు మార్లు సంచలన ఆరోపణలు సైతం చేశారు. అయితే తనకు కొరకరాని కొయ్యగా మారిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పాత పరిచయాలతో పార్టీలో కీలక పదవి ఆఫర్ చేసి కాంగ్రెస్ కండువా కప్పుతారా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంత్రి సీతక్క ఇన్‌చార్జిగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఉమ్మడి జిల్లాకు ఇప్పటి వరకు ఎలాంటి మంత్రి పదవి దక్కలేదు. దీంతో ఏలేటికి మంత్రి పదవి, మరేదైనా క్యాబినెట్ ర్యాంకు పోస్ట్ ఇవ్వొచ్చనే చర్చ జోరుగా సాగుతున్నది.

## రెండోసారి నేనే ముఖ్యమంత్రి

- మొదటిసారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఓట్లు వేశారు
- రెండోసారి నా మీద నమ్మకంతో ఓట్లు వేస్తారు
- శాసనమండలి ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి రెండోసారి కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మొదటిసారి బీఆర్ఎస్ పార్టీ మీద వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారని, రెండోసారి తన మీద నమ్మకం ఉంచి జనం ఓట్లు వేస్తారని ధీమా వ్యక్తంచేశారు. శాసనమండలి ప్రాంగణంలో శనివారం ఆయన మీడియాతో ముచ్చటించారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని, సంక్షేమ పథకాల లబ్ధిదారులే తమ ఓటర్లని అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల కోట్ల రుణమాఫీ జరిగిందని, ఒక్క కుటుంబంలో నలుగురు ఉంటే అందరికీ రుణమాఫీ చేశామని, అటువంటి ఉమ్మడి కుటుంబాలలోని వారు కోటి మంది ఉంటారని చెప్పుకొచ్చారు. కోటి మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తామని, వారు వేసే ఓట్లతోనే గెలుస్తామని అన్నారు. రాష్ట్రంలో కులగణన ఇప్పుడు కాకుంటే ఇక ఎప్పటికీ కాకపోయేదని, ప్రజలెవరైనా ఆస్తులు, అప్పుల గురించి తప్పుగా చెప్పవచ్చేమో కానీ కులాన్ని ఎవరూ తప్పుగా చెప్పరు అని అన్నారు. జనాభా లెక్కల గురించి కేంద్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను అడిగిందని, దీని ప్రకారం 2026లో జనాభా లెక్కలు పూర్తిచేసి 2027లో నోటిఫై చేస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు అనుగుణంగా కేంద్రం డీలిమిటేషన్‌కు సమాయత్తం అవుతుందని, ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవద్దని తాము ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

### 31లోగా రైతుభరోసా వేస్తాం

ఈ నెల 31వ తేదీలోగా రైతులందరికీ రైతుభరోసా సాయం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ప్రసంగం మీద ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అసెంబ్లీలో సమాధానమిచ్చారు. రైతబంధు కింద గత ప్రభుత్వం ఒక్కో ఎకరానికి ఏడాదికి రూ.10 వేలను అందించిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.12 వేలకు పెంచి అమలు చేస్తున్నామని తెలిపారు. రైతుభరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తున్నామని తెలిపారు.

### పులిచింతలతో తెలంగాణకు నష్టం లేదు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఏపీ ప్రభుత్వం నిర్మించిన పులిచింతల ప్రాజెక్టుతో తెలంగాణకు ఎలాంటి నష్టం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని శాసనసభలో బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి లేవనెత్తిన అంశంపై మంత్రి స్పందించారు. కృష్ణా జలాల్లో తెలంగాణా వాటాను తేల్చేందుకు కేంద్రం వద్ద పోరాడుతున్నామని చెప్పారు.

## 'పాలమూరు'తోనే దక్షిణం సస్యశ్యామలం

- రాజకీయ ప్రయోజనాలు వీడండి
- ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయండి
- రైతు సంఘాల సమాఖ్య డిమాండ్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ ప్రజల సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాప్రయోజలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు. కృష్ణా నదీ పరిరక్షణ జేఏసీ, తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.